# జామచెట్టు

పాపినేని శివశంకర్

ఆ యింట్లో పుట్టటం కన్నా అడవిలో పుట్టడం మేలని ఆ జామచెట్టు అనుకుందో లేదోగాని ఇంటి పెద్ద దిక్కు కామాక్షమ్మ మంచానపడేపాటికి – ఆ చెట్టుకు చెంబెడు నీళ్లు పోసేవాళ్లు కరువయ్యారు. కార్తీక మాసం నాటికి పూతతో, పిందెతో కళకళలాడాల్సింది కళావిహీనమపోయింది. కామాక్షమ్మకి, జామచెట్టుకి ఏళ్ళతరబడి అనుబంధం వుంది. వాళ్లిద్దరికీ రక్తసంబంధం ఏమన్నా ఉందా అని జువాలజీ చదువుతున్న మనవడు ఓ మోస్తరు పరిశోధన కూడా చేశాడు.

ఏరోజైనా జామచెట్టుకి రెండు చెంబుల నీళ్ళు పొయ్యకుండా తను నాలుగు చెంబుల స్నానం చేసేది కాదు కామాక్షమ్మ. ఎండాకాలం నీళ్లు దొరకని కాలంలోను ఒక చెంబెడు నీళ్లు తనే తగ్గించుకొని జామచెట్టుకి పోసేది. దాని నీడలోనే ఒక బండమీద అంట్లు తోమేది. రాత్రిపూట వంట పాత్రల్లో అంతో ఇంతో అన్నం, కూరలు మిగలాల్సిందే. ఇక తెల్లారి అంట్లు తోమేటప్పుడు జామచెట్టు కొమ్మల మీద, ప్రహరీ గోడ మీద కాకులు గలగలా వాలేవి.

''రామ రామ! ఈ కాకి గోలతో చచ్చిపోతున్నాం గదండీ!'' అనేది కోడలు తులసి, భర్త మధుసూదన్‌తో.

''అవును, కాకులు కాకిగోల చేస్తాయనే నీ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నా'' అంటాడు మధుసూదన్.

అత్తగారిని ఒక్కమాటైనా అంటాడేమోనని ఆశించిన తులసి విసుక్కునేది. ఒక్కోసారి అత్తగారి ఆగడం సాగకూడదనే ఉద్దేశంతో రాత్రి వంటకి మరీ తక్కువ బియ్యం వేసేది. కాని కామాక్షమ్మ తను తినే అన్నంలోనే ఒక ముద్ద మిగిల్చి తెల్లారి అంట్లు కడిగేటప్పుడు జామచెట్టు కింద విదిల్చేది. ఇక కాకులకు పండగే పండగ.

అటువంటి కామాక్షమ్మ – తొంభై ఏళ్లపాటు ఏ అనారోగ్యం లేకుండా తిరిగింది. హఠాత్తుగా మంచమెక్కింది.

''మా తరం అయిపోయిందిరా నాన్నా! నేనింక ఎక్కువ రోజులు బతకను'' అంది కొడుకు చేతిని తన చేతిలోకి తీసుకుంటూ. మధుసూదన్ కళ్లనీళ్ల పర్యంతమయ్యాడు.

కోడలు తులసి మాత్రం ''అత్తయ్యగారూ! మీరు పోయినసారీ ఇట్లానే అన్నారు'' అంది గడుసుగా.

''నాయనమ్మా! నీకింకా తీరని కోరికలేమైనా ఉంటే చెప్పు, నేను తీరుస్తాను''



# సానియా కష్టాలు..

'ఓవర్‌నైట్‌లో స్టార్నయిపోయానని అనుకుంటారు అందరూ..కానీ, పదమూడేళ్లు నే పడ్డ కష్టం ఎవరు చూస్తారు? విజయంలో టాలెంట్ వుండేది ఐదు శాతమే. మిగతాదంతా కఠిన మైన సాధనలోనే వుంటుంది. అంతేకాదు, కుటుంబపరంగా కూడా ఎన్నో త్యాగాలు చేయా ల్సివుంటుంది. విదేశీ మారకద్రవ్యాన్ని మార్చుకోడంలో నేనో మహారాణినంటున్నారు సరే.. నాకెన్ని ఖర్చులుంటాయో తెల్సాండి? ప్రయాణం ఖర్చులు, వసతి సదుపాయాలు, ఇంకా కోచింగ్ వంటివి బోలెడు ఖరీదైన ఖర్చులుంటాయి. అవేవీ లెక్కకట్టరు. నాకు వచ్చేదే చూస్తారు కానీ పోయేది ఎంతో గమనించరు జనాలు. ఒక్కోసారి నవ్వటం యిష్టంలేక పోయినా నవ్వాల్సిన పరిస్థితులుంటాయి. కొన్ని విమర్శలు అయితే మూశారుగా ఎలా వచ్చిపడ్డాయో నామీద.' అంటూ నిట్టూర్చుతోంది సానియా. సీత కష్టాలు సీతవి. సానియా కష్టాలు సానియావి మరి..



అని అడిగాడు మనవడు జగన్ మంచం పక్కనే కూర్చుని.

''ఏమీ లేవురా తండ్రీ! కాకపోతే నేను పోయిన తర్వాత మీ నాన్నని కాస్త జాగ్రత్తగా చూసుకో. అసలే అర్భకుడు. ఎవరికీ ఎదురుచెప్పలేడు'' అంటూ కోడలివైపు ఓ చూపు చూసింది కామాక్షమ్మ.

''అన్నట్లు దొడ్లో జామచెట్టును ఎండిపోనివ్వకు. పిచ్చిమొహంది, నీకన్నా ఐదేళ్లు చిన్న''.

జగన్‌కు బాగా గుర్తు. తన చిన్నతనంలో చాలా సమయం దొడ్లో జామచెట్టు కిందే గడిచింది. దోర దోర కాయలు చూపించి వాటిని కోయించేది నాయనమ్మ. ముక్కలుగా కోసి అందరికీ పెట్టేది. అప్పుడప్పుడు జగన్ చెట్టెక్కి కొమ్మల్లో కూర్చుని చిలకల్తో, ఉడతల్తో ముచ్చట్లాడేవాడు.

''అదేమిటత్తయ్యా! పిల్లవెధవని చెట్టెక్కించారూ? కిందపడి, ఏ కాలో చెయ్యో విరగ్గొట్టుకుంటే?'' అనేది తులసి.

''అంతగా పడితే నేనే వాడికి సేవలు చేస్తాను లేమ్మా'' అనేది కామాక్షమ్మ, కోడలి మూతి విరుపును కాచుకుంటూ.

కామాక్షమ్మ మంచం పట్టిన నాలుగు రోజులకే కోడలు తులసి బాత్‌రూంలో జారిపడి కాలు విరగ్గొట్టుకుంది. హాస్పిటల్ తతంగం అయిన తర్వాత అత్తయ్య పక్కనే ఆమెకీ మంచం సమకూరింది.

''పోనీలే తల్లీ! పక్కనే వుంటే నాకూ కాస్త కాలక్షేపం'' అంది కామాక్షమ్మ.

''మీ కాలక్షేపం బాగానే వుంటుందిగానీ, ఇంటి పనులన్నీ ఎవరు చేస్తారో మరి?'' అంది తులసి.

ఈ వార్త తెలిసిన బంధువులు, మిత్రులు అత్తాకోడళ్లనిద్దర్నీ జంటగా పరామర్శించేందుకు వరసగా వచ్చారు. మధుసూదన్‌కి బావ వరస అయ్యే పెద్దమనిషి పరామర్శ అయిన తర్వాత ఓసారి ఇంటా బయటా అంతా కలయదిరిగాడు.

''అదీ సంగతి, నేను ముందే ఊహించాను. అదేమిటోయ్ ఇంటికి వాయవ్యంలో అంతెత్తున చెట్టు పెరిగి వుంటే చూస్తూ ఊరుకున్నావ్? ఎంత అరిష్టం! ఎంత అరిష్టం?'' అన్నాడు కంగారుగా.

ఇంటికి వాయవ్యం ఎటువైపో ఆలోచిస్తున్నాడు మధుసూదన్.

''అవునా అన్నయ్యగారూ!'' అంది భయంగా తులసి.

''అవునమ్మా! అది మంచిది కాదు'' అన్నాడాయన.

తులసి చెల్లెలు కూడా అవుననేపాటికి తులసికి ఇంటికేమైనా వాస్తుదోషం తగిలిందేమోనన్పించింది. ''రేపే మాంఛి వాస్తు సిద్ధాంతిని తీసుకొస్తానుండండి'' అన్నాడా పెద్దమనిషి, ద్విగుణీకృతోత్సాహంతో. మధుసూదన్ కేవలం ప్రేక్షకుడిగా ఉండిపోయాడు.

తెల్లారేపాటికి ఒకానొక స్ఫురద్రూపి అయిన ఆగంతకుడు నుదుట కాసంత కుంకుమ బొట్టుతో, చేతిలో ఏదో పుస్తకంతో భూతవైద్యుడి వీసమెత్తు తీసిపోయే వేషంలో దిగాడు. పట్టణంలో సుప్రసిద్ధ వాస్తు సమ్రాట్ ఆయన.

కాఫీ సేవనం అయిన తర్వాత వాస్తుసమ్రాట్ విజృంభించాడు. ఇంట్లోవాళ్లవైపు ప్రసన్నంగానూ, ఇంటివైపు తీక్షణంగానూ చూశాడు. ఇంటి చుట్టూ, ఇంట్లో గదిగదికి తిరిగాడు. ఏవేవో లెక్కలు వేశాడు. 'దిశ బాగుంటేనే దశ బాగుంటుంది' అని చెప్పాడు. ఇంటికి ఈశాన్యంలో గేటు పెట్టించమన్నాడు. వాయవ్యంలో ఉన్న జామచెట్టును తక్షణం కొట్టించమన్నాడు. లేకపోతే మంచం మీదున్న వాళ్లకి మరింత మూడే ప్రమాదముందని హెచ్చరించాడు. నూటపదహారు రూపాయల దక్షిణ గ్రహించి నిష్క్రమించాడు.

కామాక్షమ్మ వాస్తుసమ్రాట్ మాటల్ని తేలిగ్గా తీసిపారేసింది. కాని మధుసూదన్‌కి వాస్తుమీద గురి కుదిరింది. వెంటనే ఇంటిముందు గేటు తప్పించి ఈశాన్యంలో పెట్టించాడు. ఆ తర్వాత దొడ్లో జామచెట్టుకన్నా తల్లి ఆరోగ్యమే ముఖ్యమనే నిర్ణయానికి వచ్చాడు. చెట్టు కొట్టేందుకు ఒక గొడ్డలి మనిషిని మాట్లాడాడు. దొడ్లోకి వెళ్లి చెట్టును చూపించాడు. తెల్లారే వచ్చి చెట్టును కొట్టేస్తానని చెప్పి ఆ మనిషి వెళ్లిపోయాడు.

యథాలాపంగా కాసేపు జామచెట్టు కింద నిల

బడ్డ మధుసూదన్ బుర్ర కాసేపటికి 'ఠంగ్'మని మోగింది. 'ఇది ఒంటిగంట సమయం కాదే' అని ముందు సందేహించాడు మధుసూదన్. ఆ తర్వాత తన తల బొప్పికట్టిందని, కారణం పైనుంచి రాలిన జామకాయేనని గ్రహించాడు. 'ఎంత అహంభావ మెంత కండకావరమీ జామవృక్షానికి? రేపే దీని పీచమణిచెదను గాక!' అనుకున్నాడు.

ఆ వెంటనే 'తమ వదనం' అనే మాట విన్పించింది మధుసూదన్‌కి. 'నీ మొహం అనటానికి బదులు ఆ మాట అన్నారని గ్రహించాడు. అయితే ఎవరా మాటన్నదీ అంతుపట్టలేదు. పైగా తను మనస్సులో కదా అనుకున్నది? ఒక్కసారి తల పైకెత్తి చూశాడు. చెట్టు కొమ్మల మధ్య ఒక ఉడత జామకాయను కొరుకుతూ కన్పించింది.

''ఉడతలు మాట్లాడవు గదా?'' అనుకున్నాడు తనలో.

''మనుషులు నిష్ప్రయోజకులైనప్పుడు ఉడతలు కూడా మాట్లాడతాయి'' అని విన్పించింది.

ఉలిక్కిపడ్డాడు మధుసూదన్. భయం భయంగా మళ్లీ ఉడత వంక చూశాడు. ''నీకు మాటలు వచ్చా?'' అనడిగాడు.

''నీకన్నా బాగానే వచ్చు. అచ్చులు, హల్లులు స్పష్టంగా పలకగలను. చెప్పమంటావా? అమ్మ - ఆవు - ఇల్లు - ఈగ - ఉడత''

మధుసూధన్ విసుక్కున్నాడు. ''చాల్చాల్లే. మాటలు నేర్చావు బాగా. మా చెట్టుమీద కూర్చుని మాకే పాఠాలు చెపుతున్నావే?''

ఉడత కిచకిచా నవ్వింది. ''మీ చెట్టా? అంటే నువ్వు నాటావా ఈ జామ చెట్టుని?''

''లేదులే. మా అమ్మ నాటింది.''

''పోనీ నువ్వెప్పుడైనా చెంబెడు నీళ్లు పోశావా దీనికి?''

మధుసూదన్ మౌనం వహించాడు.

''మరి ఈ చెట్టు నీదంటావేమిటి?''

''నీళ్లు పొయ్యకపోయినా మా యింటి దొడ్లో, మా నేలమీద పెరిగింది కనుక దీనిమీద మాకు సర్వహక్కులున్నాయి.''

''ఈ భూమి నీ సొంతమా? నువ్వు, నీ వెనకటి తరాలు పుట్టకముందు ఈ నేల ఎవరి సొంతం?''

''ఏమో. ఏమైనా ఈ భూమి మీద మా జాతే గొప్పది. మాదే ఈ ప్రపంచం. మా శక్తియుక్తులు మరెవ్వరికీ లేవు'' అన్నాడు దురుసుగా మధుసూదన్.

''అట్లాగా? అయితే ఈ కాయ కొరికి చూడు'' అంటూ ఉడత ఒక పచ్చి జామకాయ రాల్చింది.

దాన్ని తీసుకున్నాడు మధుసూదన్. ''అమ్మో, ఇంత గడ్డుకాయనెలా కొరకడం? మొన్నే ఒక పన్ను కూడా ఊడిపోయింది.

ఉడత నవ్వింది. ''నా పళ్ళెప్పటికీ ఊడిపోవు. మాలో దంతవైద్యులు లేరు. ఎన్ని హెయిర్ ఆయిల్స్ రాసినా నా తోక కుచ్చు అంత అందం మీ జుట్టుకొస్తుందా? పోనీ, ఈ చెట్టు చిటారుకొమ్మనెక్కగలవా?''

''అమ్మో, కిందపడితే?'' భయపడ్డాడు మధుసూదన్.

''అదే మరి. నీ శక్తియుక్తులంటావేమిటి?''

''మా జాతి శక్తియుక్తులు కాకపోతే ఈ సృష్టి మీద మా ఆధిపత్యం ఎట్లా సాధ్యమవుతుంది? మానవుడే ఈ విశ్వానికి కేంద్ర బిందువని మేధావులు చెప్పారు, తెలుసా?''

''విశ్వాన్నంతా మీ మేధావులు చుట్టబెట్టి వచ్చారా?''

''లేదనుకో''

''అయితే విశ్వానికి మనిషే కేంద్ర బిందువని ఎట్లా సిద్ధాంతం చేశారు మీరు? మీ మనుషులు మీకోసమే సిద్ధాంతాలు, నీతులు తయారు చేసుకున్నారు. మీరు మాత్రం బ్రతికితే చాలు మీకు. ప్రకృతి అంతా మీకే చెందుతుందనుకుంటారు. నిజానికి మీరు కూడా ప్రకృతికి చెందుతారు. ప్రకృతిలో అన్ని ప్రాణులకూ సమానస్థానం ఉండాలి. మీ ఆవిడకి కాలు విరిగితే కలిగే దుఃఖం ఈ చెట్టుకి మొదలు విరిగితే కలగదా? చూడు ఈ జామచెట్టు తన వినాశం గురించి ఎట్లా విలపిస్తుందో?''

జామచెట్టు ఆకుల వెంట బొట్లు బొట్లుగా మంచు నీళ్లు జారుతున్నట్టు జారుతున్నాయి. మధుసూదన్ గుండె బరువెక్కింది. ఉన్నట్టుండి చెట్టు మొదలు నుంచి ఏవో మాటలు విన్పించసాగాయి.

''మనిషీ! నేనీ నేలమీద అత్యంత సహజంగా జన్మించాను. భూమి పొరల్లో అత్యంత సహజంగా లభించే నీరు తాగి ప్రాణాలు నిలుపుకున్నాను. నన్ను పోషించిన మీ తల్లి ధన్యాత్మురాలు. మనుషులకు తెలిసిన పరోపకార విద్య మానులకు తెలీదు. నా నీడలో మీ పిల్లలు ఆడుకున్నారు. నేను శుభ్రపరిచిన గాలిలో మీరంతా ఆరోగ్యంగా ఊపిరి పీల్చారు. ఇంతెందుకు? మీ సంతానం మీకు తప్ప మరెవ్వరికీ ఉపయోగపడరు. మరి నాకు ఒకే ఋతువులో వందలకొద్ది సంతానం కలుగుతుంది. నిజానికి నా వంశం నిల్పటానికి నాలుగు గింజలు చాలు. ఇక ఇన్ని వందల కాయలు నేనెవరికోసం కాస్తున్నానో ఎప్పుడన్నా ఆలోచించావా? నామీద ఆధారపడి ఎన్ని ప్రాణులు బతుకుతున్నాయో తలెత్తి చూశావా? ఇవాళ ఏవో పిచ్చి మాటలు నమ్మి ఎవరో గొడ్డలి మనిషిని తెచ్చి, నా అంతు చూడబోతున్నావు. చెట్లు, అడవులు, పశువులు, పక్షులు అన్నీ ధ్వంసించిన తర్వాత నీ నాగరికత దేనికోసం? బతికేవాడు అన్నిటినీ బతకనివ్వాలి గదా? మనిషీ! ఎన్నో విద్యలు నేర్చావు గానీ రెండే రెండు అక్షరాలు మాత్రం నువ్వింకా నేర్చుకోలేదు'' అని విషాదంగా నిట్టూర్చింది జామచెట్టు.

మధుసూదన్ ఖిన్నుడయ్యాడు. ఎంతో పశ్చాత్తాపం అతని మనస్సును ఆవరించింది. తమాయించుకుని అడిగాడు.

''నేను నేర్చుకోలేకపోయిన ఆ రెండక్షరాలేమిటి?''

''దయ'' అన్నది జామచెట్టు.

మధుసూదన్‌కి జామచెట్టు కింద జ్ఞానోదయమైంది. తరతరాల మానవజాతి తాను అభివృద్ధి చెందుతున్న క్రమంలోనే చేసిన ప్రకృతి విధ్వంసమంతా కళ్లముందు గిర్రున తిరిగింది. తన తల్లి జీవిత సారాంశం కూడా అప్పుడే సరికొత్తగా అర్థమైంది.

''చెట్టు తల్లీ! నన్ను క్షమించు. ఇక మీదట గొడ్డలి మనిషిని ఇంట్లోకి రానియ్యను'' అన్నాడు నిర్మలంగా. చెట్టుమీద ఉడత కిచకిచమంది. చిలక కొరికిన మంచి జామపండొకటి కింద రాలింది.

''ఒరే నాన్నా! నేనిప్పుడప్పుడే పోయేట్టు లేనురా!'' అంటూ మంచం దిగి కామాక్షమ్మ నడిచి వస్తున్న దృశ్యం మధుసూదన్‌ని ఆనంద పరవశుణ్ణి చేసింది.

★

